సాక్షి గుంటూరు

బుధవారం ౹ 26 ౹ జూన్ ౹ 2024



నేడు శివపార్వతుల కల్యాణం

నగరంపాలెం: గుంటూరు మల్లారెడ్డినగర్‌లోని ధర్మశాస్త అయ్యప్పస్వామి గుడి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

పెదకాకాని: తక్కెళ్లపాడుకు చెందిన భైరవనేని నరసింహారావు భార్య జయమ్మ జ్ఞాపకార్థం శివాలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజలను ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో కార్మిక శాఖ మంత్రి సుభాష్



అమరావతి: స్థానిక బాలచాముండికా సమేత అమరేశ్వరుణ్ణి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సుభాష్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామి వారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం గురువారం కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయివరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ ప్రైవేటు, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు పాల్గొంటున్న డ్రైవ్‌లో విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని సూచించారు. డ్రైవ్‌లో పాల్గొనాల్సిందిగా గుంటూరు జిల్లాలోని అన్ని పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 73868 85639, 83339 73929, 89196 65437 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తైక్వాండోలో నలుగురికి బంగారు పతకాలు




తెనాలిఅర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన తైక్వాండో పోటీల్లో తెనాలి కేఎస్‌ఆర్ తైక్వాండో అకాడమి కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావుతోపాటు విద్యార్థులు కొక్కిలిగడ్డ భువనశ్రీ, పి.గౌరిలక్ష్మి, భీమవరం జ్యోతేంద్రలకు బంగారు పతకాలు లభించాయి. వీటిని రేపల్లెలో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. అంతేకాకుండా వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28, 30 తేదీల్లో ఒడిశాలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయని వివరించారు. పతకాలు సాధించిన వారిని ఏపీ తైక్వాండో జనరల్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, గ్రేసీ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి శామ్యూల్ రాజు తదితరులు అభినందించారు.

యార్డులో 53,183 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 53,183 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 51,353 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ. 20,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,393 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది. రోజా నుంచి శ్రీశైలం జలాశయానికి 912 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

వ్యవసాయం.. నిరీక్షణ

- సాగుకు భరోసా ఏదీ?
- కొత్త ప్రభుత్వంలో అందని పెట్టుబడి సాయం
- ఇంకా ఏ ప్రకటన చేయని రాష్ట్ర సర్కారు
- రైతులకు తప్పని ఎదురు చూపులు
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తోపాటు వైఎస్సార్ రైతు భరోసా నిధులు



పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద విడుదలైన నిధుల వివరాలు..

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు(కోట్లలో)
2019–20	1,21,888	164.55
2020–21	1,25,894	169.96
2021–22	1,15,083	155.36
2022–23	1,20,689	162.93
2023–24	1,26,030	170.14

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించారు. చాలా మంది దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసి సేద్యాన్ని చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో 650 హెక్టార్లలో పంటల సాగు మొదలైంది. ఈ పరిస్థితుల్లో వీరికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయం విడుదల చేసింది. ఈ మేరకు ఈనెల 18వ తేదీన రైతుల ఖాతాలకు రూ.2 వేలు చొప్పున గుంటూరు జిల్లాలో 85,400 మంది రైతులకు రూ.17.08 కోట్లు జమ య్యాయి. ఈ మొత్తం సాగుకు సన్నద్ధమైన రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుకు కాసింత సహాయపడనుంది. ఈ రూ.2 వేలు కేంద్ర ప్రభుత్వం వాటా కాగా, రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందిస్తూ వచ్చింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాలకు జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాలకు జమ చేసేది. అందులో ఖరీఫ్ ఆరంభంలో మొదటి విడత, కోతల సమయంలో రెండో విడత, ధాన్యం ఇంటికి చేరే వేళ మూడో విడత ఇలా రైతుల ఖాతాలకు జమ చేసేది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్లపాటు అందించింది.

కౌలు రైతులకూ..

ఎటువంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు అటవీ, దేవాదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం విడుదల చేసేది. దీంతోపాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని కౌలు రైతుల ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేసింది.

రాష్ట్ర సాయం కోసం ఎదురు చూపు..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఈ దశలో రైతులు దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. ప్రస్తుతం కేవలం రూ.2 వేలు పీఎం కిసాన్ నిధులు మాత్రమే అందడంతో ఈ డబ్బులు ఎటూ చాలవని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ కొలువుదీరారు. మంత్రులతో తొలి క్యాబినెట్ భేటీ కూడా ముగిసింది. అయినా రైతుల పెట్టుబడి సాయంపై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాయం ఇస్తుందని అన్నదాతలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.



కలెక్టర్ పి.రంజిత్ బాషాను సన్మానిస్తున్న అధికారులు

అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ

బాపట్ల: అధికారుల సహకారంతోనే 16 నెలల పాటు జిల్లా అభివృద్ధికి మంచిగా పని చేసే అవకాశం లభించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం మందిరంలో నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా ఆయనను సన్మానించారు. అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎంత మంది పేదలకు సాయం చేశామన్న అంశమే ఉద్యోగంలో సంతృప్తినిస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. పని చేసే ప్రాంతంలో ప్రతి అంశంపై అవగాహన పెంచుకుంటే విధులు సులభతరం అవుతాయన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఇద్దరూ సోదర భావంతో అన్నింటిలోనూ తనకు సహకరించారని అభినందించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు జిల్లాకు ఒక వనరుగా నిలిచారని కితాబిచ్చారు. అందువల్లే బాపట్లలో ఎన్నికలు సమర్థంగా నిర్వహించామన్నారు. జిల్లాలోని అధికారులంతా కుటుంబ సభ్యులుగా మెలిగి, పని చేసిన తీరు మరువలేనిదన్నారు. 2008లో కడప జిల్లాలో ఆర్డీఓగా పని చేసినప్పటి నుంచి సాధించిన విజయాలను ఆయన వివరించారు. తన అనుభవాలను పంచుకున్నారు.

మంచి అధికారిగా గుర్తింపు: ఎస్పీ వకుల్ జిందాల్

క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ఎన్నికలు సమర్థంగా నిర్వహించిన మంచి అధికారిగా, నాయకుడిగా కలెక్టర్ రంజిత్ బాషా నిలిచారని ఎస్పీ వకుల్ జిందాల్ కొనియాడారు. ఎలాంటి తప్పులు లేకుండా ఎన్నికలను జయప్రదంగా నిర్వహించారన్నారు. నిబంధనలను పక్కాగా అమలు చేయడం, ప్రతి అంశంపై అవగాహన, పట్టు ఉండడంతోనే ఎన్నికలు సజావుగా సాగాయని పేర్కొన్నారు. బాపట్లలో మంచి పేరు సంపాదించారని, కర్నూలు జిల్లాలోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

శ్రమించే తత్వంతో ముందుకు: జేసీ శ్రీధర్

శ్రమించేతత్వం, ముందు చూపు, సూక్ష్మ ప్రణాళికతో కలెక్టర్ రంజిత్ బాషా సమర్థంగా పని చేశారని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. పరిపాలన వ్యవస్థకు మార్గ నిర్దేశం చేయడం, వ్యవస్థతో చక్కగా పనిచేయించడం వంటి నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిగా నిలిచారన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా 5వ స్థానంలో నిలిచిందని వివరించారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, చీరాల, రేపల్లె ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

29న జాతీయ మెగా లోక్ అదాలత్



జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 29న జిల్లా వ్యాప్తంగా జాతీయ మెగా లోక్ అదాలత్ జరగనున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు కేసులు పరిష్కరించుకునేందుకు మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఇరు పక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, వీలైనంత ఎక్కువ కేసులను పరిష్కరించేలా చూడాలని వివరించారు. లోక్ అదాలత్‌లో రాజీ పడే క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ వివాదాల కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆహారం.. వందనం

రూ.వందకు ఈ రోజుల్లో ఒక పూట భోజనం రావడమే కష్టం.. కర్రీ పాయింట్లలో మూడు రకాల కూరలు తీసుకుంటేనే రూ.50 నుంచి రూ.70 వరకు అవుతుంది. అలాంటిది ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం ఐదు రకాల కూరలు ఇంటికే సరఫరా చేస్తున్నారు 'కృష్ణాస్ లంచ్ బాక్స్' నిర్వాహకులు. వంట చేసుకోలేని ఒంటరివాళ్లు, వృద్ధులకు ఇది వరంగా మారుతోంది.

- చౌక ధరకే ఒంటరి జీవితాల ఆకలి తీరుస్తున్న 'కృష్ణాస్ లంచ్ బాక్స్'
- ఇంటికే పంపిణీ చేస్తున్న వైనం
- రోజుకు రూ.100 చొప్పున నెల ప్యాకేజీతో..
- ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం కూరలు సరఫరా



వండిన కూరలను క్యారియర్లలో సర్దుతున్న నిర్వాహకులు



సరఫరాకు బయలుదేరుతున్న డెలివరీ బాయ్స్

తెనాలి: ఆయనో డెబ్బై ఏళ్ల వృద్ధుడు. భార్య మరణించింది. బిడ్డలు ఎక్కడో నగరంలో ఉద్యోగాల్లో ఉన్నారు. సొంతూరు వదిలి వెళ్లాలని లేని ఆయన ఓపిగ్గా తిరుగుతున్నా ఇంట్లో వంట చేసుకోలేని అశక్తత.. భార్యాభర్తలిద్దరూ వృద్ధులు.. బిడ్డలు ఈ దేశంలోనే లేరు. అక్కడకు వెళ్లలేరు. ఇక్కడ తిండితిప్పలూ సొంతంగా చేసుకొనే ఓపిక లేదు.. ఇలాంటివారు ఎందరికో ఆంధ్రాప్యారిస్ తెనాలిలో 'కృష్ణాస్ లంచ్ బాక్స్' అక్షయపాత్రగా మారింది. కేవలం వంద రూపాయలకు ప్రతిరోజూ ఠంఛనుగా సమయానికి మూడు పూటలా వండిన ఆహారాన్ని ఇంటికే సరఫరా చేస్తోంది.

రెండున్నరేళ్ల క్రితం ఒక్కరితో ఆరంభం

తెనాలి చెంచుపేటలోని అమరావతి ప్లాట్స్‌లో సాధారణ డాబా ఇంటిలో నడుస్తోంది 'కృష్ణాస్ లంచ్ బాక్స్' సోమవారం 11 గంటల ప్రాంతంలో ఆ ఇంటికి వెళ్లగానే ఒక పక్క వంటలు వండుతున్నారు. వండిన వంటలను క్యారేజి బాక్సుల్లో సర్దుతున్నారు. వాటిని తీసుకెళ్లేందుకు డెలివరీ బాయ్స్ సిద్ధంగా ఉన్నారు. లంచ్ బాక్స్ నిర్వాహకురాలు పరుచూరి లక్ష్మి. విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా చేస్తున్న ఆమె కుమారుడు పవన్‌కుమార్, కోడలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీలేఖ ఆమెకు సహకారం అందిస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం ఒక సహాయకుడితో కేవలం ఒక్కరికి భోజనం పంపటంతో ఆరంభించిన ఈ లంచ్ బాక్స్.. ఇప్పుడు 125 మందికిపైగా ఖాతాదారులకు రోజూ అందుతోంది. ఈ వినూత్నమైన ఆలోచన ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 మందికిపైగా ఉపాధి కల్పిస్తోంది.

ఓ వృద్ధుడి అభ్యర్థనతో నాంది

2022లో కంటి శుక్లం తీయించుకున్న పెద్దాయన ఒకరు 'తెలిసినవాళ్ల ఎవరైనా రెండువారాలు భోజనం పంపుతారేమో చూసిపెట్టండి' అని చేసిన అభ్యర్థన కృష్ణాస్ లంచ్ బాక్స్‌కు నాంది పలికింది. దగ్గర్లోనే ఉండే పెద్దాయనకు మనం వండుకుందే పంపితే సరిపోతుందని అనుకున్నారు. ఆ విధంగా రోజూ తాము చేసుకున్న బ్రేక్‌ఫాస్ట్, భోజనం, రాత్రికి మరోసారి అల్పాహారం పంపుతూ వచ్చారు. కరోనాతో తల్లి చనిపోయిన ఇద్దరు అన్నదమ్ములు ఈ విషయం తెలిసి, 'మాక్కూడా ఇవ్వొచ్చు కదా' అని అడిగారు. దగ్గర్లోని వేర్‌హౌసింగ్ గిడ్డంగి దగ్గరకు వ్యాహ్యాళి కోసం వచ్చే పెద్దలు మేం కూడా తీసుకుంటాం అంటూ ముందుకొచ్చారు. ఆ విధంగా కృష్ణాస్ లంచ్ బ్యాక్స్‌ను విస్తరించినట్టు లక్ష్మి వెల్లడించారు.

మెనూ ప్రకారమే..

ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల్లోపు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం 12.30 గంటలలోగా కూరలు, రాత్రి 7.30గంటల కల్లా టిఫిన్ ఖాతాదారులకు పంపుతున్నారు. పట్టణంతో పాటు పరిసరాల్లోని 125 మందికిపైగా లంచ్ బాక్స్ మూడుపూటలా వెళుతోంది. ఏరోజు ఏ బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చేదీ మెనూలో ఉంది. వారంలో మూడురోజులు ఇడ్లీ, మిగిలిన నాలుగురోజులు దోసె, వడ, పూరీ, పెసరట్టు, సాయంత్రం రెండు రోజులు చపాతి, మిగిలిన ఐదు రోజులు గోధుమరవ్వ ఉప్మా, సెట్ దోశ, సాంబారు ఇడ్లీ, ఊతప్పం పంపుతున్నారు. మధ్యాహ్నం రోటి పచ్చడి, ఇగురు కూర, గుజ్జుకూర/పప్పు, పప్పుచారు, రసం చొప్పున ఐదు రకాలను అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం కూరలతోపాటు చికెన్ కూర, ఎగ్ పులుసు, చేపల పులుసులో ఏదో ఒకటి పంపుతారు.

సమయానికి డెలివరి..

ఆహారం సరఫరాకు ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాలను సమకూర్చుకున్నారు. వాటిపై డెలివరీ బాయ్స్ ఇళ్లకు వెళ్లి ఇచ్చి వస్తుంటారు. బండి చెడిపోయి ఎక్కడన్నా ఆగిపోతే ఆ బాక్స్‌ను చేర్చటానికి ఇంట్లో మరో ఇద్దరు ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంటున్నారు. పెద్దవయసు వాళ్లు ఆకలికి ఆగలేరు. షుగర్, బీపీ వంటి మందులు వేసుకుంటారు. అందుకనే డెలివరీకి సమయపాలన పాటిస్తున్నట్టు నిర్వాహకురాలు లక్ష్మి వివరించారు.

లాభార్జన కోసం చేయటం లేదు



మేం వ్యాపారం చేస్తున్నామని అనుకోవటం లేదు. మానవత, సేవా దృష్టితోనే చేస్తున్నాం. పెద్దలను దృష్టిలో ఉంచుకుని వంటకాల్లో మసాలాలు వాడటం లేదు. ఉప్పూ, కారం తక్కువగానే ఉంటాయి. పెద్దలు రైస్‌ను ఇంట్లోనే కుక్కర్‌లో వండుకుంటున్నారు. తప్పనిసరి అంటే రైస్ కూడా పంపుతున్నాం.

– పరుచూరి లక్ష్మి, నిర్వాహకురాలు

ఉత్సవాలకు నెలవు

ఇంద్రకీలాద్రిపై 6 నుంచి ఆషాఢ మాసోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి ఆషాఢ మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. జూలై 6 నుంచి ప్రారంభమయ్యే ఆషాఢ మాసం ఆగస్టు 4వ తేదీతో ముగుస్తోంది. నెల రోజుల పాటు నిర్వహించే ఆషాఢ మాసోత్సవాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. దుర్గమ్మ వారు తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీర, సారె, పూజా సామగ్రిని సమర్పిస్తారు. నెల రోజుల పాటు అమ్మవారి ఆలయం సారె సమర్పించేందుకు విచ్చేసే భక్త బృందాలు, దేవస్థాన కమిటీలు, సేవా బృందాలతో కళకళలాడుతుంది.

14న తెలంగాణ బోనం

14వ తేదీ దుర్గమ్మకు హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించనున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని కోరుతూ ఏటా అమ్మవారికి బోనాలను సమర్పించడం ఆనవాయితీ.

19 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు

జూలై 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే శాకంబరీదేవి ఉత్సవాలలో అమ్మవారి మూలవిరాట్‌ను ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో మూడు రోజుల పాటు అలంకరిస్తారు. ఇక అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహిస్తారు. 19వ తేదీ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన జరుగుతాయి. 21వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. శాకంబరీదేవి ఉత్సవాలలో ప్రతి రోజు సుమారు 70 నుంచి 80 వేల మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతి పేద రైతుకు రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్



కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్

నరసరావుపేట: రుణాలు అవసరం ఉన్న అర్హులైన ప్రతి పేద రైతుకు రుణం అందించే విధంగా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. డిసెంబరు–2023 నుంచి మార్చి–2024కు సంబంధించి డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు పథకాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణాల మంజూరులో బ్యాంకర్లు సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశానికి సంబంధిత బ్యాంక్ కంట్రోలర్లు, జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని చెప్పారు. సమావేశానికి గైర్హాజరైన బ్యాంకర్ల నుంచి అధికారుల వివరణ తీసుకోవాలని ఎల్‌డీఎంకు సూచించారు. రాబోయే సమావేశాలకు అందరు హాజరయ్యేలా చూడాలన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి ఎల్‌డీఎం, మెప్మా అధికారులు సంయుక్తంగా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ఎంత మందికి గృహాలు మంజూరు చేశారు, ఎంతమంది రుణాలు తీసుకున్నారు, తీసుకున్నవారిలో ఎంత మంది సకాలంలో చెల్లిస్తున్నారనే వివరాలపై ఆరా తీశారు. మీటింగ్ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి టి.మాధురి, ఎల్‌డీఎం ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలూ నాయక్, పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యాన శాఖాధికారి రమణారెడ్డి, పశు సంవర్ధక శాఖాధికారి కాంతారావు, ఆర్‌బీఐ ప్రతినిధి సునీల్, నాబార్డు అధికారి శరత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పద్మశాలీయ సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శిగా సత్యం



పెదకూరపాడు: అఖిల భారత పద్మశాలీయ సంఘం అనుబంధ సంస్థ కోస్తా పద్మశాలీయ సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిల్లాపల్లి సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షులు జి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో సంఘ సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్యం ఇప్పటికే జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారన్నారు. సత్యం మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా సాధికారత దిశగా అడుగులు వేయాలన్నారు. చేనేత రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుని దానికనుగుణంగా పద్మాశాలీల హక్కుల సాధన కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

అమరావతి మ్యూజియాన్ని అభివృద్ధి చేయాలి

అమరావతి: అమరావతి ఆర్కియాలజీ మ్యూజియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో కేంద్ర పురావస్తు శాఖ మ్యూజియం అధికారి రాహుల్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుంచి ప్రముఖులు, బౌద్ధులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్న అమరావతి మ్యూజియం అభివద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా సాధించాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంత్ నాయక్



వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా సాధించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని శ్రీరాంపురంతండాలో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీని ఆంధ్ర రాష్ట్ర ఎంపీల మీద ఆధారపడి నడుస్తుండటంతో ప్రత్యేకహోదా సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంలో కీలకంగా మారినందున రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో కేంద్ర మంత్రి పదవులు తీసుకున్నందున కేంద్రం చేతిలో టీడీపీ కీలు బొమ్మగా మారకుండా ప్రత్యేక హోదా సాధించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయటానికి శాఖల వారీగా కూటమి ప్రభుత్వం శ్వేత పత్రాలు విడుదల చేసేందుకు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటానికి మాత్రమే సమయాన్ని కేటాయించిందని ఆరోపించారు.

'చిరుమువ్వల' సవ్వడి



కర్ణాటక్ గవర్నర్ థవార్‌చంద్ గెహ్లాత్ నుంచి నగదు బహుమతిని స్వీకరిస్తున్న గ్రీష్మశ్రీ



నృత్యాంశాన్ని అభినయిస్తున్న గ్రీష్మశ్రీ



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు

- నృత్య చిన్నారి గ్రీష్మశ్రీకి నేడు సత్కారం
- ముగ్గురు గవర్నర్ల నుంచి ప్రశంసలు అందుకున్న బాల నర్తకి
- చదువుతున్న పాఠశాలలో విద్యాశాఖ అధికారుల సమక్షంలో అభినందన

తెనాలి: గ్రీష్మశ్రీ.. ఎనిమిదేళ్ల చిన్నారి.. మూడేళ్ల సాధనతోనే కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరుస్తోంది. పలు వేదికలపై చిరుమువ్వల సవ్వడి చేస్తోంది. పదనర్తనం, అభినయంలో వయసుకు మించిన పరిణితితో అభినందనలు అందుకుంటోంది. అనుకోకుండా వచ్చిన అవకాశంతో మూడు రాష్ట్రాల గవర్నర్ల ఎదుట తన నృత్యప్రతిభను ప్రదర్శించింది. వారి ప్రశంసలను అందుకుంది. ఇప్పుడు ఏకంగా తాను చదువుతున్న పాఠశాలలోనే విద్యాశాఖ అధికారుల సమక్షంలో సత్కారం అందుకోనుంది. పట్టణానికి చెందిన సెవ్వ కృష్ణారెడ్డి, అరుణ కుమారి దంపతుల కుమార్తె గ్రీష్మశ్రీ. తండ్రి స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. నాజరుపేటలోని అరవింద విద్యాకేంద్రంలో నాలుగో తరగతి చదువుతున్న గ్రీష్మశ్రీ కొద్ది నెలల్లోనే ముగ్గురు గవర్నర్ల చేతుల మీదుగా అభినందనలు అందుకుంది. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బాల నర్తకికి అభినందన సభ ఏర్పాటుచేశారు. పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ అతిథులుగా హాజరవుతున్నారు. గ్రీష్మశ్రీతోపాటు ఆమె నృత్యగురువైన నిర్మలా రమేష్‌ను సత్కరించనున్నట్టు అరవింద విద్యాకేంద్రం డైరెక్టర్ కొండపనేని సంపూర్ణ తెలిపారు.

ఐదో ఏటనే కాళ్లకు గజ్జెలు..

గృహిణి అయిన తల్లి అరుణకుమారి ప్రోత్సాహంతో గ్రీష్మశ్రీ ఐదో ఏటనే కాళ్లకు గజ్జెలు కట్టింది. పట్టణానికి చెందిన ప్రముఖ నృత్యగురువు నిర్మలా రమేష్ శిష్యరికంలో కూచిపూడి నృత్యాన్ని శ్రద్ధగా సాధన చేస్తోంది. ఆ క్రమంలోనే తాను నేర్చిన నృత్యాంశాలను ప్రదర్శిస్తూ వస్తోంది. వివిధ వేదికలపై ప్రదర్శించిన నృత్యాభినయానికి తోటి సాధకులు, తల్లిదండ్రులు, ప్రదర్శన నిర్వాహకుల నుండి ప్రశంసలు దక్కాయి. ఆ క్రమంలో అనుకోని రీతిలో కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థవార్‌చంద్ గెహ్లాత్ ఎదుట అక్కడి రాజ్‌భవన్‌లో నృత్యం ప్రదర్శించే అవకాశం లభించింది. చిన్నారి గ్రీష్మశ్రీ నృత్యాన్ని చూసి ముగ్ధుడైన గవర్నర్ అభినందించటమే కాకుండా నగదు బహుమతిని అందజేసి ఆశీర్వదించారు. ఆ తర్వాత హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అనంతరం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఎదుట నృత్యాంశాలను ప్రదర్శించే భాగ్యం చిన్నారికి కలిగింది. 'గ్రీష్మశ్రీ తొలి నుంచి ఏకసంథాగ్రాహి అని.. నృత్యసాధనలో చూపిన శ్రద్ధతోనే అందరి ప్రశంసలను అందుకుంటోంది' అని తల్లి అరుణకుమారి అన్నారు. చదువుతోపాటు శాస్త్రీయ నృత్యంలో సాధన కొనసాగిస్తామని చెప్పారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



రాణించిన శ్రీకాకుళం జట్టు బ్యాట్స్‌మెన్ రోహిత్, కడప బ్యాట్స్‌మెన్ ఎండీ ఖాసిం, శ్రీకాకుళం బౌలర్ హేమచంద్ర, కడప జట్టు బౌలర్ నాగకిషోర్

మంగళగిరి: అమరావతి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్–16 మల్టిడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో కడప జట్టు, శ్రీకాకుళం జట్టు హోరాహోరీగా తలపడుతున్నాయి. మంగళవారం టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 113.2 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ సి.హెచ్.రోహిత్ 9 ఫోర్లతో 58 పరుగులు చేయగా కె.చరిత్ ఆరు ఫోర్లతో 42 పరుగులు చేసి రాణించారు. కడప జట్టు బౌలర్ జె.నాగకిషోర్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 58.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ ఎస్.ఎం.డి.ఖాసిమ్ 6 ఫోర్లతో 46 పరుగులు, జి.గోయల్ 8 ఫోర్లతో 48 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. శ్రీకాకుళం జట్టు బౌలర్ కె.హేమచంద్ర 3 వికెట్లు తీశాడు. ఆట ముగిసే సమయానికి కడప జట్టుపై శ్రీకాకుళం జట్టు 53 పరుగుల ఆధిక్యత సాధించింది.

హోరాహోరీగా కడప-శ్రీకాకుళం మ్యాచ్

అండర్-16 క్రికెట్ మ్యాచ్‌లో విశాఖ భారీ విజయం

- ఇన్నింగ్స్ 433 పరుగుల తేడాతో పశ్చిమ గోదావరిపై గెలుపు
- మ్యాచ్‌లో 11 వికెట్లు సాధించిన గౌతమ్‌ఆర్య



కె.గౌతమ్‌ఆర్య

నరసరావుపేట ఈస్ట్: అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో విశాఖ జట్టు, పశ్చిమ గోదావరి జట్టుపై భారీ విజయం సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్న పోటీలలో భాగంగా తొలి మ్యాచ్‌లో రెండు జట్లు పోటీ పడ్డాయి. విశాఖపట్నం జిల్లా జట్టు, ఇన్నింగ్ 433 పరుగుల తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో భాగంగా మంగళవారం రెండు వికెట్ల నష్టానికి 391 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్ చేపట్టిన విశాఖ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌ను ఐదు వికెట్ల నష్టానికి 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు మరోమారు పేలవమైన ఆట తీరుతో 89 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని జె.సాయిరామ్‌చరణ్ 69 బంతులకు 31 పరుగులు సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు సాధించి పశ్చిమ గోదావరి పతనాన్ని శాసించిన విశాఖ బౌలర్ కె.గౌతమ్‌ఆర్య రెండో ఇన్నింగ్స్‌లోనూ 13.2 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించి విశాఖ జట్టు ఘన విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇన్నింగ్స్ 433 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన విశాఖ జట్టుకు 7పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పదిమందికిపైగా గాయపరిచిన వైనం
- తీవ్ర గాయాలతో జీజీహెచ్‌కు బాధితులు







కుక్క దాడిలో గాయపడిన స్థానికులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో మంగళవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారినందరినీ కరిచి గాయపరిచింది. దీంతో స్థానికులు బయటకు రావడానికే భయపడ్డారు. ఆర్ అగ్రహారం రావ్ బహదూర్ మేడ వద్ద, అవధాని టవర్స్ ఎదరుగా మంగళవారం 12 గంటల సమయంలో ఓ పిచ్చికుక్క 10 మందినిపైగా గాయపరిచింది. ఇందులో చిన్నారులు, మహిళలూ ఉన్నారు. నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేయడంతో ప్రజారోగ్య విభాగ సిబ్బంది వచ్చి కుక్కను తీసుకెళ్లారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



కుక్కను బంధించిన నగరపాలక సంస్థ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో తాపీ కూలి మృతి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి బైపాస్‌రోడ్‌కు ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ తాపీకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాయిప్రసాద్ కథనం ప్రకారం మాచర్ల పట్టణానికి చెందిన వేముల ఆంజనేయులు (52) కూలి పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పనులు ముగించుకుని తాను ఉంటున్న గదికి వెళ్తుండగా కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని మంగళగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులు కుమారుడు వేముల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆంజనేయులుకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

సరిగా బోధించని ఉపాధ్యాయులను తొలగిస్తాం

పల్నాడు జిల్లా డీఈఓ వెంకటేశ్వర్లు



రాజుపాలెం: ఏ సబ్జెక్టులో అయితే పిల్లలకు మార్కులు తక్కువగా వస్తాయో ఆ టీచర్‌ను తొలగించి వేరే వారికి అవకాశం కల్పించనున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని కస్తురిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంగళవారం పరిశీలించారు. భోజనశాల, వండిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీచర్స్ అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది పిల్లలకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పిల్లల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, ఎక్కువ మార్కులు సాధించే విధంగా టీచర్స్ కృషి చేయాలని అన్నారు. టీచర్స్ సమయపాలన పాటించాలని సూచించారు. పిల్లలందరూ పరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి ఉపాధ్యాయులను అభినందించారు. ఆయన వెంట ఎంఈఓ మల్లికార్జున శర్మ, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి ఉన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ భరోసానిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలుపు దీమాతో విర్రవీగడం సరి కాదన్నారు. టీడీపీ, జనసేన నాయకుల ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోతోందని మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పిల్లలంతా బడిలోనే ఉండాలి

సమగ్ర శిక్ష ఏఎంఓ మోజెస్



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎంవో మోజెస్

సంతమాగులూరు (అద్దంకి): బడి బయటి పిల్లలందరూ తప్పనిసరిగా బడిలోనే ఉండాలని సమగ్ర శిక్ష ఏఎంఓ మోజెస్ పేర్కొన్నారు. మండలంలోని సంతమాగులూరు ఎంపీపీఎస్‌లో జరుగుతున్న 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఒక దివ్యాంగ విద్యార్థిని గుర్తించి బడిలో చేర్పించారు. స్టూడెంట్ కిట్ అందజేశారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఏఎంఓ మాట్లాడుతూ బడి బయటి, బడిలోని విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. విద్యా సామగ్రి పంపిణీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎల్‌ఎస్ వి.సత్యసాగర్, ఎంఈఓ కోటేశ్వరరావు, సీఆర్‌పీడబ్ల్యూ ఆంజనేయులు, ఐఈఆర్పీలు జి.ఫిలిప్ రెడ్డి, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఆటోనగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సయ్యద్ సుభాని

పెదకాకాని: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. గుంటూరు ఆనంద్‌పేటకు చెందిన సయ్యద్ దావూద్ ఆటోనగర్‌లో పాత ఇనుము (స్క్రాప్) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అతని సోదరుడు సయ్యద్ సుభాని ఆటోనగర్‌లోని షాపులో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి రోడ్డు పక్కనే నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఈ ఘటనలో సయ్యద్ సుభాని(45) అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు. మృతుని సోదరుడు సయ్యద్ దావూద్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరాస్వామి తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో కంప్యూటర్లు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ప్రభుత్వ కార్యాలయంలో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసుల కథనం ప్రకారం .. రాజాగారితోటలోని గాంధీపార్కు వెనుక ఉన్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రి ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కార్యాలయ తలుపులు పగులగొట్టి లోపలకు చొరబడిన గుర్తుతెలియని వ్యక్తి కార్యాలయంలోని రెండు కంప్యూటర్లు చోరీ చేశాడు. కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలను ముందుగానే పక్కకు తొలగించి చోరీ చేశాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. నెహ్రూ యువ కేంద్ర అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా మార్ట్ తొలగింపు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా అద్దంకిలో గతంలో అన్నా క్యాంటీన్ ఉన్న భవనం నిరుపయోగంగా ఉండటంతో ఆ స్థలంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. మహిళా పొదుపు గ్రూపు సభ్యుల పెట్టుబడి సుమారు రూ.10 లక్షలతో మహిళలతో ఈ మార్టు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ అదే స్థానంలో అన్నా క్యాంటీన్ నిర్వహించాలన్న పట్టుదలతో స్థానిక టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి, మార్టును ఖాళీ చేయించారు. దీంతో మార్టులోని సరుకులు, ఇతర సామగ్రిని మెప్మా కార్యాలయానికి తరలించారు. ఇక మార్టు నిర్వహించరని భావించిన పెట్టుబడిదారులైన పొదుపు సంఘాల మహిళలు మంగళవారం మెప్మా కార్యాలయంలో సీసీఎఫ్ ఫణి కుమారిని లెక్కలు చూపించాలని కోరారు. తమ పెట్టుబడులు తమకు ఇచ్చేయాలని పట్టుబట్టారు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో సభ్యులు ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మెప్మా అధికారి ఫణికుమారి ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని చెప్పారు.

బీపీటీ-2595 రకంతో మంచి దిగుబడులు

ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలమురళీధర్ నాయక్

కారంచేడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో అన్నదాతలకు విత్తన ఎంపిక ప్రధానమని బాపట్ల ఏరువాక కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.బాలమురళీధర్ నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీపీటీ–2595 రకం విత్తనాలతో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కారంచేడు ఆర్బీకేలో మంగళవారం ఏర్పాటు చేసిన విత్తన ఎంపిక అవగాహన కార్యక్రమంలో బాలమురళీధర్ పాల్గొని, రైతులతో మాట్లాడారు. ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా వరిలో బీపీటీ–2595 రకం వంగడాన్ని పరిచయం చేస్తున్నామని తెలిపారు. విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ రకం విత్తనాలు సాగు చేసిన తర్వాత పంటను 150 నుంచి 155 రోజుల మధ్యన తీసుకోవచ్చాన్నారు. పంట సార్వా(ఖరీఫ్) సాగుకు అనుకూలంగా ఉంటుందని, అగ్గి తెగులు, దోమ పోటును కూడా సమర్థంగా తట్టుకోగలుగుతుందని వెల్లడించారు. పంట పడిపోకుండా ఉంటుందని, బియ్యం అన్నానికి అనుకూలంగా ఉంటాయని వివరించారు. అవసరమైన రైతులు విత్తనాలను సాగు చేసుకుని, మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జె.రాధాకృష్ణ, డాక్టర్ ఎం.ఉష, వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు, టి.భవాని, జె.జ్యోతి, జి.లలిత ప్రియ, రైతులు పాల్గొన్నారు.

బెదిరింపులు భరించలేకపోతున్నాం

ఎస్పీ ఎదుట వాపోయిన ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యం

బాపట్లటౌన్: బాపట్లలో కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి తమను నిత్యం బెదిరింపులకు పాల్పడుతూ.. వేధింపులకు గురిచేస్తున్నారంటూ పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్స్, క్లినికల్ లేబరేటరీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సాయంత్రం ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ హక్ మాట్లాడుతూ బాపట్లలోని ప్రైవేటు వైద్యశాలలు, ల్యాబ్, స్కానింగ్ సెంటర్లలో అర్హత కలిగిన వైద్యాధికారులు, టెక్నీషియన్లు పనిచేస్తున్నారన్నారు. దీనిపై డీఎంహెచ్ఓ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అర్హత లేని వైద్యశాలలు, ల్యాబ్‌లపై చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అయినప్పటికీ గతేడాది కాలంగా బాపట్లలో నేర చరిత్ర కలిగిన కొంతమంది సభ్యులు ముఠాగా ఏర్పడి ప్రైవేట్ హాస్పిటల్స్, ఫిజియోథెరపీ సెంటర్స్, క్లినికల్ ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్లపై తప్పుడు కథనాలను వాట్సప్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విధంగా బ్లాక్ మెయిల్ చేస్తూ అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అలా ఇవ్వని పక్షంలో ఆయా సంస్థల పేరుప్రతిష్టలు దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి వారి బారి నుంచి తమను రక్షించాలని కోరుతూ ఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు వెల్లడించారు. దీనిపై స్పందించిన ఎస్పీ వకుల్ జిందాల్ స్పందిస్తూ.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి దీనికి కారకులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ మధు డేవిడ్, బాపట్ల ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మధు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

వేమూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని ఆ పార్టీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని జగనన్న కాలనీ శిలాఫలకం ధ్వంసం చేసి, కొల్లిపర పూర్ణ చంద్రరావుపై దాడి చేశారని చెప్పారు. వేమూరు మండలంలోని చంపాడు గ్రామంలో వలంటీర్‌పై కూడా దాడి చేస్తే.. అండగా నిలిచామన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, ప్రతి నాయకుడు, కార్యకర్త వెన్నంటి ఉంటామని భరోసానిచ్చారు.